ప్రజాశక్తి
ఆదివారం 9 జులై 2023 5 అనంతపురం

బటన్ నొక్కి రైతుల ఖాతాల్లోకి వాతావరణ బీమా సొమ్మును జమ చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

బిటిపి భూసేకరణకు నిధులు

- తమది రైతు సంక్షేమ ప్రభుత్వం
- ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టండి
- రైతులను పట్టించుకోని తెలుగుదేశం
- రైతు దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి

రైతు దినోత్సవ బహిరంగ సభలో పాల్గొన్న ప్రజలు, రైతులు (ఇన్‌సెట్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి)

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భైరవానితిప్ప ప్రాజెక్టుకు హంద్రీనీవా ద్వారా ఎత్తిపోతల పథకానికి భూసేకరణకు నిధులు మంజూరు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. 1400 ఎకరాల భూసేకరణకు అవసరమైన రూ.208 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. రైతు దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం ఆయన అనంతపురం జిల్లాకు విచ్చేశారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తికి ఉదయం వచ్చారు. అక్కడ సత్యసాయి జిల్లా వైసిపి నాయకులు, కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం హెలిక్యాప్టర్‌లో కళ్యాణదుర్గంకు చేరుకున్నారు. అక్కడ అనంతపురం జిల్లా వైసిపి ప్రజాప్రతినిధులు, నేతలు స్వాగతం పలికారు. అనంతరం మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన సభా వేదిక వద్దకు విచ్చేశారు. అక్కడ అగ్రిల్యాబ్ కేంద్రాలను ప్రారంభించారు. పక్కనే ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో పంటలబీమా రైతు లబ్ధిదారులతో ముఖాముఖి అయ్యారు. అనంతరం వేదికపై వచ్చాక వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ గౌతమి ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రసంగించారు. కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాలకు సాగునీటిని అందించే భైరవాని తిప్ప ప్రాజెక్టుకు హంద్రీనీవా ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణకు అవసరమైన రూ.208 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. కళ్యాణదుర్గంలో అంబేద్కర్ భవన్, నియోజకవర్గం పరిధిలో షాదీఖానా, లింగయత్, తదితర సామాజిక తరగతులకు కమ్యూనిటీ హాళ్లకు నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. రైతులకు తమ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉందని చెప్పారు. ఈ నాలుగేళ్లలో రాష్ట్రంలోనూ, అనంతపురం జిల్లాలోనూ ఒక్క కరువు మండలం లేదని పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సగానికిపైగా మండలాలు కరువు మండలాలున్నాయన్నారు. ప్రకృతి సహకారంతో మంచి పంటలు ఈకాలంలో పండాయని చెప్పారు. అయినా తమ ప్రభుత్వ హయాంలోనే రైతులకు పంటలబీమా అధికంగా వచ్చిందన్నారు. గతంలో ఐదేళ్లలో రూ.3411 కోట్లే బీమా వస్తే ఈ నాలుగేళ్లలో రూ.7802 కోట్లు ఇచ్చామన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా పంటలకు గిట్టుబాటు ధర అందించేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రజలకు మంచిచేస్తే అడ్డుపడుతున్న విపక్షాల మాటలు నమ్మొద్దని సూచించారు. త్వరలో జరగబోయే కురుక్షేత్ర యుద్ధంలో ప్రజలకు మంచి చేసే ప్రభుత్వానికి మద్దతునివ్వాలని కోరారు. దుష్టచతుష్టయాలు మాయమాటలతో మీ ముందు కొస్తున్నాయని పేర్కొన్నారు. అటువంటి వారికి కాకుండా ప్రజలకు మంచిచేసే తమకు అండగా నిలువాలని కోరారు. అనంతరం సభావేదిక నుంచే రాష్ట్ర స్థాయిలో ఖరీఫ్ 2022 ఉచిత పంటల బీమా పరిహారాన్ని 10.20 లక్షల మందికి రూ.1117.21 కోట్లను బటన్ నొక్కి విడుదల చేశారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 1,36,950 మంది అన్నదాతలకు రూ.212.94 కోట్ల మేర పంటల బీమా లబ్ధి చేకూరింది. రూ.63.96 కోట్ల ఖర్చుతో ఏర్పాటు చేసిన 52 డా॥వైఎస్ఆర్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్ భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, వై.శివరామిరెడ్డి, మంగమ్మ, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వై.వెంకటరామి రెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ సి.హరికిరణ్, జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ కె.శ్రీనివాసులు, జెసి కేతన్‌గార్గ్, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వర రెడ్డి, గురునాథ రెడ్డితో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, రైతులు, పాల్గొన్నారు.

ఆదర్శ రైతులతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి : మంత్రి ఉషశ్రీ చరణ్

వైసిపి అధికారంలోకి వచ్చాక కులం, మతం, పార్టీ అన్న బేధం లేకుండా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల లబ్ధిని పారదర్శకంగా అందిస్తున్నట్లు రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే ఉషశ్రీచరణ్ తెలిపారు. రైతు దినోత్సవ బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ రైతును రాజుగా చేయడమే ముఖ్యమంత్రి జగనన్న ఆశయం అన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం వెనకబడిన ప్రాంతమని, ఈ ప్రాంతం అభివృద్ధి కోసం భైరవాని తిప్ప ప్రాజెక్ట్‌కు 1407 ఏకరాలను భూసేకరణ ద్వారా అందజేసిన రైతులను ఆదుకునేందుకు నిధులు విడుదల చేయాలని మంత్రి ముఖ్యమంత్రిని కోరారు. బీసీలు ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గంలో చాకలి, కుమ్మరి, లింగాయత్ తదితర బీసీ కులాల వారికి కమ్యూనిటీ హాల్, రెసిడెన్షియల్ స్కూల్, ఎస్సీలకు అంబేద్కర్ భవనం, మైనార్టీలకు ఈద్గా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ హామీలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రి కోరిన ప్రతి విజ్ఞాపనకు నిధులు మంజూరు చేస్తున్నామని ముఖ్యమంత్రి సభాముఖంగా హామీ ఇచ్చారు.

ముఖ్యమంత్రి పర్యటనలో అపశృతి

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కణేకల్లు : కళ్యాణదుర్గంలో శనివారం నిర్వహించిన ముఖ్యమంత్రి పర్యటనలో అపశృతి చోటు చేసుకుంది. బహిరంగ సభలో పాల్గొనేందుకు వెళ్లిన ఓ వ్యక్తి తిరుగు ప్రయాణంలో ఇంటికొస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

జగన్మోహన్‌రెడ్డి బహిరంగసభకు కనేకల్ మండల పరిధిలోని ఎర్రగుంట గ్రామానికి చెందిన అల్లావుద్దీన్ అలియాస్ సన్నప్పయ్య(45) శనివారం ఉదయం వెళ్లాడు. బహిరంగ సభ అనంతరం అదే గ్రామానికి చెందిన శర్మాస్‌తో కలిసి ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. ఈ సమయంలో రాయదుర్గం నుంచి కళ్యాణ్ దుర్గంకు వెళు_న్న ప్రయివేటు బస్సు గుబనపల్లి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో అల్లావుద్దీన్ అక్కడికక్కడే మరణించాడు. మరో వ్యక్తి శర్మాస్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయన్ను చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైతులకు నిరాశే..!

ప్రయోజనం లేని ముఖ్యమంత్రి పర్యటన

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం ప్రకటించిన అరకొర పంటల బీమా స్థానంలో పూర్తి స్థాయి ఇన్‌పుట్ సబ్సిడీని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించి ఆదుకుంటాడని ఎదురు చూసిన రైతులకు తీవ్ర నిరాశే మిగిలిందని సిపిఎం జిల్లా కమిటీ విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కళ్యాణదుర్గంలో నిర్వహించిన రైతు దినోత్సవసభలో ముఖ్యమంత్రి విద్యుత్ ఒప్పందాలు, స్మార్ట్ మీటర్ల గురించి అబద్ధాలు మాట్లాడాడని చెప్పారు. జిల్లాలో అప్పుల బాధలు భరించలేక గత సంవత్సరం 68 మంది, ఈ సంవత్సరం ఇప్పటి వరకు 21 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చే అరకొర రైతుభరోసా, పంటల నష్టపరిహారం రైతుల్లో ధైర్యాన్ని నింపడంలేదన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా రైతుభరోసా కేంద్రాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పడం హాస్యాస్పదం అన్నారు. మార్కెట్లలో దళారులు ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తూ రైతులను నిలువ దోపిడీ చేస్తున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కళ్యాణదుర్గంలో టమోటా రైతులు ధరల పతనంతో పెద్ద ఎత్తున నష్టపోయారని చెప్పారు. ప్రస్తుతం టమోటాకు ధర ఉన్నా దళారుల ప్రమేయంతో ఆ ప్రయోజనం రైతులకు చేరడం లేదన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా సాగయ్యే వేరుశనగ పంట క్రమంగా కనుమరుగవుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లాలోని ప్రాజెక్టులు ముఖ్యంగా గత 16 సంవత్సరాలుగా సాగుతున్న హెచ్ఎల్సీ ఆధునీకరణ పనులు ఆగిపోయిన విషయం, హంద్రీనీవా పంటకాల్వలు తవ్వకపోవడంపై ముఖ్యమంత్రి స్పందించకపోవడం విచాకరం అన్నారు. కర్ణాటకలో నిర్మిస్తున్న అప్పర్‌భద్ర వల్ల అనంతపురం జిల్లా రైతాంగానికి తీవ్రంగా నష్టం జరుగుతుందన్నారు. దీనిపై కూడా ముఖ్యమంత్రి మాట్లాడలేదన్నారు. జిల్లాలో పరిశ్రమలు నిర్మిస్తామన్న వైసిపి ఎన్నికల హామీ నేటికీ అమలు కాలేదన్నారు. రాప్తాడు దగ్గరలో గార్మెట్ పరిశ్రమలు వస్తున్నాయని గత నాలుగు సంవత్సరాలుగా ప్రచారమే తప్పా ఆచరణలో ఒక్క పరిశ్రమ కూడా వచ్చిన దాఖలాలు లేవన్నారు. విద్యుత్ సంస్కరణల వల్ల వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టి ప్రతి పైసా వసూలు చేసే విధానాన్ని పార్లమెంట్‌లో ఆమోదించి రాష్ట్రంలో మాత్రం ఉచిత విద్యుత్ కొనసాగిస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమే అవుతుందన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే విద్యుత్ ఛార్జీలు తప్పనిసరిగా పెరుగుతాయన్నారు. ఇప్పటికే సర్దుబాటు, ట్రూఆఫ్ చార్జీల పేరుతో వేల కోట్ల భారాలు ప్రజలపై వేస్తున్నారని ఆయన విమర్శించారు. అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న జిల్లా రైతులను ఆదుకునే చర్యలపై ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా ముఖ్యమంత్రి పర్యటన సాగడం విచారకరం అన్నారు.

చేనేత వస్త్ర వ్యాపారులపై దాడి అమానుషం

అనంతపురం : టిడిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు తెలిపారు. శనివారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు వస్త్ర వ్యాపారులను బలి తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ నగర నడిబొడ్డున సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తూ గుడ్డలూడతీసి బాతున్నా పట్టించుకోని గుడ్డి ప్రభుత్వం వైసిపి అన్నారు. వైసిపి గుండాలకు భయపడి వస్త్ర వ్యాపారులు రాష్ట్రం విడిచే వెళ్లే పరిస్థితి దాపురించిందన్నారు. వారిని రక్షించాల్సిన పోలీసు వ్యవస్థ చేతులెత్తేయడం దారుణమన్నారు. తక్షణమే దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

10, 11న కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా - అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగేంద్రకుమార్

విలేకరులతో మాట్లాడుతున్న అంగన్‌వాడీ యూనియన్‌నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎంతోకాలంగా అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ పేరుతో ఫుడ్ కమిషనర్, ఎంఎస్‌కె, ఎంఆర్ఒ, ఎండిఒ, రాజకీయ నాయకులు పర్యవేక్షణ పేరుతో అంగన్‌వాడీలను వేధించడంతోపాటు అవమానిస్తున్నారన్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరు ప్రాజెక్టులోని హనుమాయమ్మను రాజకీయ కక్షలతో నిర్ధాక్షణ్యంగా చంపారన్నారు.కనీసం మట్టి ఖర్చులు ఇచ్చే దిక్కు కూడాలేదన్నారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వం కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్లకు వయో పరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని, ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని, 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు కల్పించాలని, అంగన్‌వాడీ విద్యను బలోపేతం చేయాలని, పిల్లలకి యూనిఫాం, అమ్మఒడి అమలు చేయాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, మెనూఛార్జీలను పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, 2017 నుంచి పెండింగ్ లో ఉన్న టిఎ బిల్లులు ఇవ్వాలని, సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బీమా అమలు చేయాలని, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, ఆయిల్, కంది పప్పు క్వాంటిటీ పెంచాలని, సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, హత్యకి గురైన హనుమాయమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, నష్టపరిహారం చెల్లించాలని, గ్రేడ్ సూపర్‌వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని, 2022లో పరీక్ష రాసి పెండింగ్‌లోఉన్న ఉన్న గ్రేడ్ ఎ సూపర్‌వైజర్ పోస్టుల్లో మిగిలిన 164 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10, 11వ తేదీల్లో 36 గంటల నిరవధిక ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. ఈ ఆందోళనకు జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు, హెల్పర్లు, మినీ వర్కర్లు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శకుంతల, రమాదేవి, జమున, కాత్యాయని, రేష్మ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఐద్వా సంపూర్ణ మద్దతు

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 10, 11వ తేదీల్లో కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న 36 గంటల నిరసనకు ఐద్వా సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా మహిళలు, చిన్న పిల్లలకు పోషకాహారం, విద్య తదితర సౌకర్యాలు అందుతున్నాయన్నారు. అలాంటి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఐసిడిఎస్‌ను బలోపేతం చేసి విరివిగా బడ్జెట్ ఇవ్వాల్సిన ప్రభుత్వాలు కోతలు విధించడం అన్యాయం అన్నారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపడుతున్న ఆందోళనలకు సంపూర్ణ మద్దతు ఇస్తూ ఆందోళనలో పాల్గొననున్నట్లు తెలిపారు.

పెన్షనర్ల సంఘం బలోపేతం కావాలి

గుత్తి : ఎపి పెన్షనర్ల సంఘం బలోపేతం కావాలని సంఘం మండల అధ్యక్షుడు కె.అబూబకర్, అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయిబాబు సూచించారు. శనివారం పట్టణంలోని క్రీడా మైదానం వద్ద ఉన్న పెన్షనర్ల భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ప్రతి ఒక్కరూ పెన్షనర్ల సంఘంలో భాగస్వామ్యం కావాలన్నారు. పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఏడు డిఎలను తక్షణమే చెల్లించాలన్నారు. పిఆర్‌సి విషయంలో చాలామంది పెన్షనర్లు నష్టపోయారని చెప్పారు. ప్రతి నెల ఒకటో తేదీనే పెన్షన్ ఇవ్వాలన్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పెన్షనర్ అంజనమ్మకు సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షన్ల సంఘం మండల కార్యదర్శి రామ్మోహన్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, కోశాధికారి ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జెసి ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న సిఐ, ఎస్ఐ

జెసి. ప్రభాకర్ రెడ్డి గృహ నిర్బంధం

ప్రజాశక్తి-తాడిపత్రి

ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఖరీఫ్ పంటల బీమాలో పుట్లూరు, యల్లనూరు మండలాల్లో అర్హులైన రైతులకు వర్తింపజేయకుండా అనర్హులకు పెద్దపీట వేశారని ఆరోపిస్తూ తాడిపత్రి మున్సిపల్ ఛైర్‌పర్సన్ జెసి.ప్రభాకర్ రెడ్డి శనివారం నాడు పుట్లూరు మండల పర్యటనకు బయల్దేరారు. పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామంలో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కొనుగోలు చేసి సాగు చేసిన సంవత్సరం చీనీ తోటకు బీమా వర్తించడం, అర్హులైన రైతులకు వర్తించకపోవడం ఏమిటింటూ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం నాడు విలేకరుల సమావేశం పెట్టి ప్రశ్నించారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి తోటను సందర్శిస్తానంటూ ఆయన ప్రకటన కూడా చేశారు. ఈ నేపథ్యంలో జెసి.ప్రభాకర్‌రెడ్డి అక్కడికి వెళ్తారన్న ముందస్తు సమాచారంతో సిఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ వెంకటప్రసాద్‌లు తమ సిబ్బందితో శనివారం ఉదయం ఆయన ఇంటి వద్దకెళ్లారు. శాంతిభద్రతల నేపథ్యంలో ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు వీల్లేదంటూ గృహనిర్బంధం చేశారు. వేకువజామునే పోలీసులు జెసి ఇంటి వద్ద బారికెడ్లు ఏర్పాటుచేసి ఎవరినీ అటువైపు అనుమతించలేదు. పోలీసుల సూచన మేరకు పుట్లూరు మండల పర్యటనను విరమించుకుంటున్నట్లు కొద్దిసేపటి తరువాత ప్రభాకర్ రెడ్డి తెలపడంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

జెసి.ప్రభాకర్‌రెడ్డికి మెదడు చెడింది..!

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డికి మెదడు చెడిపోయి ఇష్టానుసారం మాట్లాడుతున్నాడని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడిపత్రి రూరల్ పరిధిలోని పెన్నా నది ఒడ్డున నూతనంగా నిర్మించిన వైఎస్సార్ గ్రామీణ పార్కును శనివారం నాడు ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనకు వ్యవసాయం అంటే ఇష్టం అని, అందుకే తోటలు సాగు చేస్తున్నట్లు చెప్పారు. అందరి రైతుల మాదిరిగానే తమ కుటుంబ సభ్యులకూ ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చిందన్నారు. దీనిని కూడా రాజకీయం చేసి జెసి.ప్రభాకర్‌రెడ్డి విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రైతుల నుంచి బలవంతంగా భూములను లాక్కొనే సంస్కృతి జెసి కుటుంబ సభ్యులదన్నారు. జెసి ప్రభాకర్‌రెడ్డికి ధైర్యం ఉంటే తన తోటలోకి అడుగు పెట్టాలని సవాల్ విసిరారు. తనకు ఎమ్మెల్యే పదవి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పెట్టిన బిక్ష అన్నారు. తనకు ఎమ్మెల్యే పదవి లేకుంటే జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లి కొట్టేవాడినంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రెడ్డి, ఆలూరు రామచంద్రారెడ్డి, నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, ఆలూరు రామేశ్వర్ రెడ్డి, బాబయ్య, ఎంపీటీసీ సగర రవికుమార్ పాల్గొన్నారు.

పార్కు ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ముందస్తు అరెస్టులు హేయం



ఉరవకొండ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడుతున్న సిపిఎం నాయకులకు నోటీసులు ఇచ్చి ముందస్తు అరెస్టు చేయడం హేయమైన చర్య అని సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, రైతుసంఘం నాయకులు సీనప్ప, సిద్ధప్ప అన్నారు. సిఎం జగన్ కళ్యాణదుర్గ పర్యటనను పురస్కరించుకుని శుక్రవారం అర్ధరాత్రి సమయంలో నాయకుల ఇళ్ల వద్దకు వచ్చి నోటీసులు ఇచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకుము మాట్లాడుతూ ఇళ్ల వద్దకు వచ్చి నోటీసులు ఇవ్వడంతో పాటు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమన్నారు. రాత్రి సమయాల్లో పోలీసులు ఇంట్లో దగ్గరికి రావడం మంచి పద్ధతి కాదన్నారు. పోలీసుల ముసుగులో దొంగలు వచ్చి నష్టం జరిగినట్లయితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.

రాయదుర్గం : సిఎం జగన్ కళ్యాణదుర్గం పర్యటన నేపథ్యంలో రాయదుర్గంలో పోలీసులు వామపక్ష పార్టీలు, సంఘాల నేతలకు నోటీసులు అందజేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందులో భాగంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు నాగరాజు, సిఐటియు నాయకుడు మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, సిపిఐ తాలూకా కార్యదర్శి నాగార్జున, మండల కార్యదర్శి దుర్గన్న, తాలూకా అధ్యక్ష కార్యదర్శులు కుమార్‌నాయక్, పిడిఎస్‌యు రాయదుర్గం డివిజన్ కార్యదర్శి మల్లెల ప్రసాద్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆంజనేయులు, చేనేత కార్మిక సంఘం నాయకుడు మధు సంగమేష్, వామపక్ష పార్టీలు సంఘాల నాయకులను పోలీసులు అదుపులో ఉంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ మాట్లాడుతూ తాము సీఎం పర్యటనను అడ్డుకుంటామని ఎలాంటి ప్రకటన చేయనప్పటికీ పోలీసులు అదుపులో ఉంచుకోవడం బాధాకరమన్నారు.

రాయదుర్గం స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

రైతుకు నిరాశ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఒకవైపు ప్రకృతి, మరోవైపు ప్రభుత్వం రెండు వైపుల రైతుకు నిరాశనే ఎదురవుతోంది. 2022 ఖరీఫ్‌లో అధిక వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది ఖరీఫ్ చూస్తే వర్షాభావ పరిస్థితులు వెన్నాడుతున్నాయి. గతేడాది పంటనష్టానికి సంబంధించి పంటల బీమాను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఇందులో రైతులందరికీ బీమా అందలేదు. జిల్లాలో 2.68 లక్షల మంది రైతులుంటే 1.30 లక్షల మందికి మాత్రమే బీమా అందింది. రూ.212.94 కోట్లు మాత్రమే వచ్చింది. దీనిపై విపక్షాలు పెద్దఎత్తున ఆందోళన చేపట్టాయి. రైతులందరికీ న్యాయం చేయాలని కోరుతూ ఆందోళనలు చేపడుతున్నారు. టిడిపి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అధికార పలుకుబడి ఉన్న వారికి మాత్రం పంటనష్టం జరగకపోయినా పరిహారం జాబితాలో చేరిపోయాయి. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి రూ.13 లక్షల వరకూ పరిహారం వచ్చిందని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై ఇద్దరి మధ్య వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే పంటలబీమా మంజూరుకు బటన్ నొక్కే కార్యక్రమాన్ని సిఎం జగన్ శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమం సందర్భంగా రైతు సంఘాల నాయకులు తదితరులు అడ్డుకుంటామని చెప్పడంతో వారిని అరెస్టు చేశారు. అయితే ఈ సభలోనైనా బీమా అందని రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఏమైనా ప్రకటిస్తారా అని ఆశగా ఎదురు చూశారు. కానీ ఇలాంటి ప్రకటనేది ముఖ్యమంత్రి నుంచి రాకపోవడం రైతులను తీరని నిరాశనే మిగిల్చింది. ఇక హంద్రీనీవాపై ఒక స్పష్టమైన ప్రకటన కూడా ముఖ్యమంత్రి నుంచి రాలేదు. బిటిపి ప్రాజెక్టుకు భూసేకరణ మాత్రమే నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. పనులు ఏమిటన్న విషయంపై స్పష్టతనివ్వలేదు. గతంలో2020లో వచ్చినప్పుడు కూడా ఇదే ప్రకటన వచ్చింది. కాని ఆచరణలో అమలు జరగలేదు. ఎన్నికలకు ముందు జరిగిన పర్యటనలోనైనా జిల్లాకు హామీలేమైనా ఇస్తారా అని ఆశగా ఎదురుచూస్తే నిరాశనే మిగిల్చింది. ఇక ప్రకృతి పరంగానూ రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. సీజన్ ప్రారంభమైనా పదును కావడం లేదు. మేఘాలు కమ్ముకుని వస్తున్నా... చినుకు జాడ కనిపించడం లేదు. జిల్లాలో సాధారణ సాగు తొమ్మిది లక్షల ఎకరాల వరకుంటే 50 వేల ఎకరాల్లోనే పంటల ఇప్పటి వరకు సాగులోకి వచ్చాయి. రైతులు అన్నింటినీ సిద్ధం చేసుకుని ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. మరో రెండు వారాలు ఇదే పరిస్థితి కొనసాగితే ఖరీఫ్ సాగు కష్టమయ్యే పరిస్థితులే నెలకొన్నాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఆందోళనకు

గురిచేస్తున్నాయి. ఇటు ప్రభుత్వం సహకారం తగినంత లేక, ప్రకృతి తోడ్పాటు అందక రెండు విధాలుగానూ రైతులు తీవ్రమైన నిరాశలోనున్నారు. గడిచిన మూడేళ్లుగా వర్షాలు కొంత వరకు పడటంతో రైతులు పూర్తి స్థాయిలోకాకున్నా కొంత మేరకు మెరుగైనా పరిస్థితులే ఉన్నాయి. ఈ సంవత్సరం ఇప్పటి వరు చూస్తే అనంతపురం జిల్లాలో 15 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం కనిపిస్తోంది. సత్యసాయి జిల్లాలో ఇంచుమించు ఇదే వాతావరణం ఉంది. వర్షాలు సకాలంలో రాకపోవడంతో వ్యవసాయంపై ప్రతికూలత ఏర్పడనుంది. అందుకే విపక్షాలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. దీని కోసం ఆందోళన బాట పట్టాయి. అయితే ప్రభుత్వం నుంచి అటువంటి స్పందనేది కనిపించే అవకాశాలు కనిపించడం లేదు.

విలేకరులతో మాట్లాడుతున్న ముస్లిం మైనారిటీ నాయకులు

మైనార్టీలపై అరాచకాలను ఎండగట్టాలి

టిడిపి మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సాలార్‌బాషా

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రస్తుత వైసిపి ప్రభుత్వ పాలనలో ముస్లిం మైనారిటీలపై జరుగుతున్న అరాచకాలను ఎండగట్టాలని టిడిపి మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు సాలార్ బాషా పిలుపునిచ్చారు. శనివారం రాయదుర్గం వచ్చిన సందర్భంగా పార్టీ నియోజకవర్గ పరిశీలకులు పర్వీన్‌తాజ్‌తో కలిసి శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిములందరూ ఏకతాటిపైకి వచ్చి దాడుల నియంత్రణ, సమస్యల పరిష్కారానికి ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువ నాయకులు నారా లోకేష్ అంచనా ప్రకారం రాష్ట్రంలో 52 శాతం మంది ముస్లిం మైనారిటీలు టిడిపికి మద్దతు ఇస్తున్నారన్నారు. ఆయా సమస్యల పరిష్కారం, దాడుల నియంత్రపై చర్చించేందుకు ఈనెలఖరున ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి హాజరుకావాలని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులును ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి మైనారిటీల విభాగం జిల్లా కార్యదర్శి రఫీక్‌అహ్మద్, జిల్లా అధికార ప్రతినిధి బాబా ఫక్రుద్దీన్, మీడియా కోఆర్డినేటర్ ఎస్ఎన్ బాషా, నియోజకవర్గ అధ్యక్షులు మహబూబ్‌బాషా, పార్లమెంటరీ కార్యదర్శి ఉస్మాన్‌బాషా, స్థానిక నాయకులు జమీల్‌ఖాన్, ఇనాయత్ బాషా, లతీఫ్ షేక్ మజ్జు, తదితరులు పాల్గొన్నారు.

జెసి ప్రభాకర్‌రెడ్డి ముందస్తు అరెస్టు దారుణం

పుట్లూరు : పంటలు నష్టపోయిన రైతుల వివరాలను తెలుసుకోవడంతోపాటు తోటలను పరిశీలించేందుకు మండల పర్యటనకు వస్తున్న తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డిని ముందస్తు హౌస్ అరెస్టు చేయడం దారుణమని టిడిపి నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటల బీమాలో అర్హులైన రైతులకు అన్యాయం జరిగిందంటూ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో టిడిపి నాయకులు జెసి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇందుకు ఆయన స్పందించి అర్హులైన రైతులతో మాట్లాడి వారికి న్యాయం చేసేందుకు పుట్లూరు మండలానికి వస్తుంటే అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ ప్రభుత్వంలో ప్రజాస్వామ్య పద్ధతిలో రైతులను కలవడానికి కూడా విలువ లేదా.. అని ప్రశ్నించారు. రైతు దినోత్సవమని ఘనంగా జరుపుతున్న సిఎం జగన్ రైతుల కోసం వస్తున్న నాయకులను ముందస్తు అరెస్టులు చేయించడం బాధాకరమన్నారు. ముఖ్యంగా పంటల బీమాలో అర్హుల కంటే అనర్హులకే ఎక్కువ ప్రాధాన్యత కల్పించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులైన రైతులందరితోపాటు సాగు చేసిన అన్ని పంటలకూ బీమీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

అంతురామ్ (పాతచిత్రం)

తాడిపత్రి రూరల్ : రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రూరల్ పరిధిలోని ఆటోనగర్ సమీపంలోని రైల్వే ట్రాక్ పై శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాల మేరకు.. జార్ఖండ్ రాష్ట్రం గర్వ జిల్లా జర్వ్హా మండలం టాస్రార్ గ్రామానికి చెందిన అంతురామ్ (20) తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆడ్ జస్ట్ స్టీల్ ప్లాంట్‌లో సెంట్రింగ్ పని చేయడానికి వచ్చి వారం రోజులైనా గేట్ పాస్ రాకపోవడంతో పని లేక ఇంటి మీద బెంగతో మనస్థాపం చెంది శుక్రవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

గుత్తి : మండలంలోని బాచుపల్లి గ్రామంలో శనివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పొలం రస్తా విషయంలో ఇరు వర్గాలు తగాదా పడి ఘర్షణ దిగారు. ఓ వర్గానికి చెందిన వెంకటరాముడు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

సిఎం సభ విజయవంతంపై హర్షం

రాయదుర్గం : కళ్యాణదుర్గంలో నిర్వహించిన రాష్ట్ర రైతు దినోత్సవానికి హాజరైన సిఎం జనగ్ సభను విజయవంతం చేసినందుకు విప్ కాపు రామచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అంతేగాకుండా సిఎం జగన్ రాయదుర్గం నియోజకవర్గం రైతులకు రూ.36 కోట్లు రైతన్నల ఖాతాల్లోకి జమ చేసిన జగనన్నకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే రైతు దినోత్సవానికి కళ్యాణదుర్గం వచ్చిన రైతులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, రాయదుర్గం ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

లక్ష్మీనారసింహుడి పల్లకిసేవ

పల్లకిసేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

ఉరవకొండ : పెన్నఅహోబిలంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఇఒ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్త కుటుంబానికి పరామర్శ

శింగనమల : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలంలోని వెస్ట్ నరసాపురం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ కార్యకర్త కురుబ కొండన్న కుటుంబాన్ని డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి శనివారం పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గుజ్జల వెంకట్రాముడు, నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, సాకే లోకనాథ్, జగన్‌మోహన్‌రెడ్డి, ఈడిగ పుల్లప్ప, మణికంఠారెడ్డి, కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు

శింగనమల : గుండెపోటుతో మృతిచెందిన మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త నల్లయ్య కుటుంబానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు శనివారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ముందుగా నల్లయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అండగా ఉంటామని కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సి.వెంకటేష్, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, కాయల సురేష్‌యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షులు బండి వెంకటనారాయణ, మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ గౌస్, ముంతా వెంకటేష్, శివ, రాజు, రాము, తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

తాడిపత్రి : వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని శ్రీనివాసపురంలో ఉన్న శివకృష్ణ సాయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, శివారెడ్డి, గూడూరు లక్ష్మీ రంగయ్య, బీసీ ఓబులేసు, గణేష్ రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, రవి, దస్తగిరి, మాబు వలి తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల వితరణ

రాయదుర్గం : పట్టణంలోని స్వకులసాలి సమాజ సత్రంలో శనివారం సమాజ విద్యావర్ధక సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యావర్ధక సంఘం అధ్యక్షులు ఆనందరావు మాట్లాడుతూ 1వ తరగతి నుంచి డిగ్రీ వరకూ 125 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాజ అధ్యక్షులు వెంకటేశులు, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, సాయిప్రసాద్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, రాజరాజేశ్వరి, మహిళా మండలి అధ్యక్షులు విమల, పాండురంగస్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు మురళి, తదితరులు పాల్గొన్నారు.

కాలేయంలో కొవ్వుతో ప్రమాదం

రేవంత్ గ్యాస్ట్రో, లివర్ ఆసుపత్రి వైద్యులు సి.రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - అనంతపురం

కాలేయంలో ఎక్కువ కొవ్వు ఉండటం పలు అనారోగ్య కారణాలకు దారితీస్తుందని నగరంలోని సూర్యానగర్ మెయిన్ రోడ్డులో ఉన్న రేవంత్ గ్యాస్ట్రో, లివర్ ఆసుపత్రి వైద్యులు సి.రేవంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ఊబకాయం, మధుమేహం, పీడయాబెటిస్, అధిక కొవ్వు, నరాల రక్తపోటు, నిశ్చల జీవనశైలి, కొన్ని మందుల వాడకం వంటి ప్రమాద కారకాల్లో ఒకటి, అంతకంటే ఎక్కువ ఉన్న వ్యక్తుల్లో ఇది చాలా తరచుగా సంభవిస్తుందన్నారు. కొవ్వు ఉనికి కాలేయం వాపును పెంచుతుందన్నారు. మొత్తం సిర్రోసిస్ అనే స్థాయికి చేరుకుంటుందన్నారు. సిర్రోసిస్తో బాధపడుతున్న రోగుల్లో కాలేయం దెబ్బతినడం వల్ల కొన్ని సంకేతాలు, లక్షణాలు కనిపించవచ్చున్నారు. అలసట పెరగడం, పొత్తికడుపులో ద్రవం పేరుకుపోవడం (అస్సైట్స్), అన్నవాహిక లేదా కడుపులోని సిరల నుంచి రక్తస్రావం (అనారోగ్య సిరలు), గందరగోళం (ఎన్సెఫలోపతి) ఏర్పడుతుందన్నారు. కాలేయ వాపు వ్యాధికి గురైన వ్యక్తి తగిన నివారణా చికిత్స తీసుకుంటే వ్యాధి తీవ్రతను తిరోగమనం పట్టించి కొంతవరకూ వాపును బాగు చేసుకోవచ్చున్నారు. బరువు తగ్గడం, మద్యపానానికి దూరంగా ఉండటం,

మధుమేహం నియంత్రించటం, శారీరక శ్రమపెంచేందుకు వ్యాయామం చేయటం వల్ల కాలేయ వాపు వ్యాధిని ఆపడానికి సహాయపడుతాయన్నారు. ఇంకా కాలేక సమస్యల కారణంగా ఇబ్బందులు కలుగుతుంటే దగ్గరలోని వైద్యుడితో నిరంతరంగా పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం అన్నారు.

పార్వతమ్మను పరామర్శిస్తున్న బండారు శ్రావణిశ్రీ

రాచేపల్లి పార్వతమ్మకు పరామర్శ

శింగనమల : అనారోగ్యంతో అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలని రాచేపల్లి గ్రామానికి చెందిన టిడిపి కుటుంబ సభ్యులు శ్రీనివాసులు భార్య పార్వతమ్మను నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా పార్వతమ్మ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నార్పల మండలం కర్ణపుడికి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త ఓబుల్‌రాజా భార్య అపర్ణ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చితంబర దొర, చిదానందనాయుడు, గుర్రం లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమలో సభ పెట్టే అర్హత సిఎంకు లేదు..

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయలసీమను సర్వనాశనం చేసిన సిఎం జగన్‌కు సీమలో సభ పెట్టే అర్హత లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. సిఎం జగన్ కళ్యాణదుర్గం పర్యటన సందర్భంగా భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణాజలాల తరలింపు, గుంతకల్లు రిజర్వాయర్ నిర్మాణంపై నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శనివారం రాయదుర్గం ఎన్టీఆర్ సర్కిల్ నుంచి వినాయక కూడలి వరకూ ర్యాలీ నిర్వహించి బహిరంగ సభ ఏర్పాటు చేయాలని టిడిపి నాయకులు నిర్ణయించారు. అయితే విషయం తెలుసుకున్న పోలీసులు అడ్డుకున్నారు. అయినా కాలవ శ్రీనివాసులు తన నివాసం నుంచి పోలీసుల కన్నుగప్పి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ కార్యాలయం నుంచి కాలవ బయటకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పార్టీ కార్యాలయం ఎదుట నాయకులు, కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. అయితే కాలవ శ్రీనివాసులును పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం మీడియాతో కాలవ మాట్లాడుతూ సాగునీటి పథకాల పనులను నాలుగేళ్లుగా పూర్తిగా నిలిపివేసి రాయలసీమ భవిష్యత్తును సర్వనాశనం చేస్తున్న సిఎం జగన్ విధానాలకు వ్యతిరేకంగా ర్యాలీకి పిలుపునిస్తే పోలీసులతో కార్యక్రమాన్ని అడ్డుకోవడం బాధాకరమనానరు. ప్రజాస్వామ్యంలో ప్రజల తరపున పోరాటం చేయాల్సిన బాధ్యత ప్రతిపక్షాలపై ఉందన్నారు రోడ్డుపై తాము నడిస్తే ఎవరికైనా నష్టమా.. ప్రజా సమస్యలు వినిపిస్తే ఎవరికి బాధ.. అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాయలసీమ దుర్భిక్షానికి కేటాయించిన రూ.32 వేల కోట్ల పథకాన్ని ఎందుకు

నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు

అమలు చేయలేదని నిలదీశారు. రాయలసీమలోని నాలుగు జిల్లాల సాగునీటి అవసరాలు తీర్చే హంద్రీనీవా సుజల స్రవంతి పథకం పదివేల ఎకరాలకు విస్తరిస్తామని జగన్ హామీ ఏమైందన్నారు. జీడిపల్లి నుంచి బీటీ ప్రాజెక్టుకు కృష్ణాజలాల ఎత్తిపోతల పథకం, పేరూరు పథకం, ఉరవకొండ నియోజకవర్గంలో 50 వేల ఎకరాల బిందు సేద్యం పథకం, తుంగభద్ర ఎగువ కాలువ ఆధునీకరణ పనులు ఏమయ్యాయన్నారు. తీరని ద్రోహం చేసిన జగన్‌కు రాయలసీమలో పర్యటించే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాయదుర్గం నియోజకవర్గ పరిశీలకులు పర్వీన్‌తాజ్, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు సాలార్‌బాషా, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు హనుమంతురెడ్డి, మహబూబ్‌బాషా, కాలవ సన్నన్న, బండి భారతి, మున్సిపల్ వార్డు సభ్యులు ప్రశాంతి, జ్యోతి, హనుమంతు మోహన్‌రెడ్డి, కేశవరెడ్డి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

గ్రామీణ ప్రాంత విద్యార్థులు సాంకేతిక విద్యను చేరువ చేసేందుకు అనంతపురం కేంద్రంగా జెఎన్‌టియు ఏర్పాటు చేసిన దివంగత సిఎం రాజశేఖర్‌రెడ్డికి దక్కుతుందని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన అన్నారు వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక జెఎన్‌టియులోని పరిపాలన భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ వైఎస్ఆర్ మృతి బాధాకరమన్నారు. ఆయన రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, రిజిస్ట్రార్ సి.శశిధర్, యూనివర్సిటీ డైరెక్టర్లు శోభా బిందు, కేశవరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, సురేష్‌బాబు, సుబ్బారెడ్డి, చిత్ర, పద్మ, సువర్ణ, అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, వివిధ విభాగాల అధిపతులు, డిప్యూటీ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, రంగానాయక్, దుర్గాప్రసాద్, అసిస్టెంట్లు రిజిస్ట్రార్ నాగభూషణం, మురళి, బోధనేతర సిబ్బంది, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల : వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతకం కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నాయకులు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వైఎస్ హయాంలో రైతుల అభ్యున్నతి ఎనలేకి కృషి చేసి రైతు బాంధవుడిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, సర్పంచి మనీల సుప్రియ, ఉప సర్పంచి గవ్వల శ్రీరాములు, దుర్గం సర్పంచి రామాంజనేయులు, వైసిపి దళిత నాయకుడు వేదాంతం మోహన్, మనీల శివయ్య, చికెన్ గోపాల్, బాలనాగ, బాలకృష్ణ, డీలర్స్ అసోసియేషన్ మండలాధ్యక్షులు బారిక నరసింహులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే సుల్తాన్ పేటలో ఉన్న విగ్రహానికి స్థానిక నాయకులు జయరామ్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, భీమిరెడ్డి, లక్ష్మీరెడ్డి, బాలకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి వెంకట్రామిరెడ్డి శివారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆత్మకూరు : వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని శనివారం మండల మండల కేంద్రంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కర్యాక్రమంలో మండల యూత్ కన్వీనర్ జి.కొండారెడ్డి, ఎంపిపి హేమలత, చంద్రశేఖర్‌రెడ్డి, బాల పోతున్న, నాగరాజు, బుసిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్లూరు : వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. అనంతరం ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. తర్వాత స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు సర్పంచి ఓబులేసు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకలు కోసం పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విడపనకల్లులో...

విడపనకల్లు మండల కేంద్రంలో జెసిఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి, ఎస్సీ విభాగం నాయకులు సుంకన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గిరిబాబు ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భూమా, రఘురాం, రాజశేఖర్, నరేష్‌రెడ్డి, ఓబిరెడ్డి, శివలింగ, సీనా స్వామి, ఆంజనేయ తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని విగ్రహానికి పూలమాల

గుత్తిలో కేక్ కోస్తున్న వైసిపి నాయకులు

వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

వేసి నివాళులర్పించారు. ముందుగా విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. తర్వాత మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఎన్‌వి.నారాయణ, ఎంపిపి యోగేశ్వరి, మండల యూత్ కన్వీనర్ దుద్దెకుంట భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహం ఎదురుగా ఉన్న విగ్రహానికి, ఆర్ఎస్‌లో ఉన్న విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, ఎంపిపి జి.విశాలాక్షి, వైసిపి పట్టణ, మండల కన్వీనర్లు డి.హుస్సేన్‌పీరా, జి.గోవర్ధన్‌రెడ్డి, నాయకులు వై.సుభాష్‌రెడ్డి, మల్లయ్యయాదవ్, హనుమంతు, ఎం.రంగస్వామి, పి.సునీల్‌కుమార్, కెఎం.రంగనాయకులు, నూర్‌నాయక్, దాదాపీర్, కౌన్సిలర్లు వరద, రమణ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని వరదాయపల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహానికి శనివారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ఉపాధ్యక్షులు రామిరెడ్డి, వరదాయపల్లె గ్రామస్తులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గార్లదిన్నె : వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ నరేంద్రనాథ్‌రెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దిగుబడి ఆధారిత బీమాను వర్తింపజేయండి

సిఎం జగన్‌ను కోరిన ఉరవకొండ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

సిఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న వై.విశ్వేశ్వరరెడ్డి

వాతావరణ పంటల బీమా అమలు చేయడంలో నష్టపోతున్న రైతులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో దిగుబడి ఆధారిత పంటల బీమాను అమలు చేసి న్యాయం చేయాలని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు. ఈమేరకు శనివారం కళ్యాణదుర్గం పర్యటనకు వచ్చిన సీఎం జగన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ రాష్ట్రంలో వాతావరణ బీమా, దిగుబడి ఆధారిత బీమా అమలులో ఉన్న విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా జిల్లాలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా వేరుశనగ, కంది, చిరు ధాన్యాలకు వంటి పంటలకు వాతావరణ ఆధారిత బీమా కాకుండా దిగుబడి ఆధారిత బీమా అమలు చేయాలని కోరారు. అలాగే శీర్పి చెరువు వరకూ ఉన్న కాలువను పొడిగిస్తే తక్కువ ఖర్చుతో బెలుగుప్ప, శ్రీరంగపురం, బ్రాహ్మణపల్లి, గంగవరం, కోనాపురం చెరువులకు హంద్రీనీవా ద్వారా తక్కువ ఖర్చుతో నీరిచ్చే అవకాశం ఉందని సూచించారు. అందుకు కాలువ నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో మరో ప్రధాన సమస్య బెళుగుప్ప మండలం జీడిపల్లి గ్రామ సమీపంలోని జీడిపల్లి రిజర్వాయర్ నిర్మాణ మూలంగా కిందభాగాన ఉన్న జీడిపల్లి గ్రామస్తులు ఊటనీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి ఆర్‌అండ్‌ఆర్ (రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్) పథకం కింద నష్టపరిహారం, పునరావాసం కల్పించేందుకు ప్రాతిపాదిత రూ.87 కోట్లు విడుదల చేయాలని కోరారు.

In the court of the Senior Civil judge: Gooty

O.S.No:04/2020

Between:
K.V.Venu Gopal and others ... Plaintiffs
And
Gorava Kullayappa and others ... Defendants

ప్రతివాది 12 మరియు 13లకు నోటీసు

D12: Gorava Sankaraiah S/o G.Kullayappa Cultivation, D.No.21/32, Peddabavi Street, Old Guntakal, Guntakal.
D13: Gorava Krishnaiah S/o G.Kullayappa Cultivation, D.No.21/32, Peddabavi Street, Old Guntakal, Guntakal.

వాది, ప్రతివాదుల మీద Declaration of Title Permanent Injunction మరియు Cancellation of Sale deeds కు గాను దావా దాఖలు చేసియున్నారు. సదరి దావా మీ యొక్క హాజరు నిమిత్తం 18-07-2023వ తేది ఉ॥10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

G.Venkata Reddy, Advocate Gooty.

In the court of the Hon'ble (MACT) Prl.Distict Judge, Ananthapuramu

M.V.O.P.No: 102/2022

Between:
Mallagundla Shobha and Others ...Petitioners
And
Mohammed V.P. (died) by L.R. and Others ...Respondents

Notice to Respondent No:4

R4: Fawziya W/o Mohammad V.P. Muslim, Sineure, R/at D.No.5/3410, M66, 4th Floor, Markaz Complex, Indira Gandhi Road, Calicut, Kerala-673004.

Where as the petitioners has filed a claim petition against you and the same is posted 24-07-2023 for your appearance you are hereby directed to appear before the hon'ble court either in person or through an advocate duly instructed on 24-07-2023 at 10:30 A.M. failing which the matter will be heard and decided exparte.

(By order of the court)

G.Srikanth, Advocate Ananthapuramu, Cell: 9440204163.

IN THE COURT OF THE DISTRICT JUDGE: ANANTAPURAMU.

E.P. No.1015/2022 in ARB Case No: ARC/FSBFL/401

Between:
M/s. Five Star Business Finance Limited, Anantapur represented by its Authorized Signatory Y.Shyam Prasad, Anantapur ...Petitioner/ D.Hr
Vs
1.Lakshmi (Borrower) W/o Venkateswarlu H.No.4-1602-1, Kalyandurgam Road, Anantapur Post & Mandal, Ananthapuramu District.
2.Venkateswarlu (Co-Borrower) S/o Nagappa H.No.4-1602-1, Kalyandurgam Road, Anantapur Post & Mandal, Ananthapuramu District. ...Respondents/J.Drs

వేలం ప్రకటన

అర్జీదారుడు తన ఇ.పి. మొత్తమును రాబట్టుటకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నాడు. వేలములో పాల్గొనదలచినవారు 27-07-2023వ తేది ఉ॥ 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

Schedule of the immovable of the 1st J.Dr:
All that piece and parcel of Land Building bearing Plot No.79, situated at Papampeta Village, A.Narayanapuram Panchayat area, Ananthapuram District, Comprised in S.No.43-1 Paiki, Land measuring an extent of 89.056 Sq.yards, out of Ac 0.01.84 Cents and **Boundaries:** North by: Plot No.80, South by: Plot No.78, East by: Plot No.86, West by: Road.
DHr Value: Rs.30,00,000/-
Amina Value: Rs.50,00,000/-

(By Order of the Court)

M.Suresh Kumar Advocate for DHr. Anantapuramu, Cell: 9441168233.